క్లుప్తంగా

పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

● ఆర్వో శుభం బన్సల్



పాలకొండ: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. ఆదివారం చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 34 రూట్లు ఏర్పాటు చేసి రూట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ సజావుగా జరిగిందన్నారు. 287 మంది పీఓలు, 287 మంది ఏపీఓలతో పాటు 861 మంది ఓపీఓలను ఎన్నికలకు వినియోగిస్తున్నామని తెలిపారు. రిజర్వులో ఈవీఎంలతో పాటు ఎన్నికల సిబ్బందిని పూర్తిస్థాయిలో ఉంచామన్నారు. 145 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

వీరఘట్టం:మండలంలోని కత్తులకవిటి గ్రామానికి చెందిన మునగపాక రమణ, కొత్తవలస వెంకటరమణ కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి జెడ్పీటీసీ జంపు కన్నతల్లి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసులు, కేంద్ర బలగాలతో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.



పాలకొండ: కౌంటర్‌ల వద్ద ఎన్నికల రూట్ అధికారుల పర్యవేక్షణ



పాలకొండ: ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



కురుపాం: ఎన్నికల విధులకు బయలుదేరి వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



కురుపాం: పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

ఓట్ల పండగకు సర్వం సిద్ధం

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

పాలకొండ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీని ఆదివారం చేపట్టారు. పోలింగ్ సిబ్బంది సాయంత్రానికి తమకు కేటాయించిన కేంద్రాలను చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

● సీతంపేట: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 45,217 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 21,445 మంది, మహిళలు 23,761 మంది, ట్రాన్స్ జండర్లు 11 మంది ఉన్నారు. మండలంలోని 110 పోలింగ్ కేంద్రాల్లో వీరంతా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు.

● భామిని: మండలంలోని 44 పోలింగ్ బూత్‌లను అధికారులు సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. నలుగురు రూట్ ఆఫీసర్లు, ఆరుగురు సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



కురుపాం: ఎన్నికల విధులకు సిద్ధమైన పోలింగ్ సిబ్బంది



పాలకొండ: పోలింగ్ సామగ్రి పంపిణీ వద్ద పోలీసుల బందోబస్తు



పాలకొండ: ఎన్నికల సామగ్రితో సిద్ధంగా ఉన్న సిబ్బంది



సీతంపేట మండలంలోని కిరప పోలింగ్ కేంద్రం



భామిని: పోలింగ్ బూత్‌లకు చేరుకొంటున్న ఎన్నికల సిబ్బంది



భామిని: ఎన్నికల సామగ్రిని బూత్‌లకు తరలిస్తున్న పోలింగ్ అధికారులు

ఓటు ఇలా వేద్దాం..

సీతంపేట:

ఓటు వజ్రాయుధం. సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దాన్ని సద్వినియోగం చేసుకుని మంచి నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్ బాగుంటుంది. ప్రలోభాలకు తలొగ్గి ఓటుహక్కును దుర్వినియోగం చేసుకుంటే ఐదేళ్ల పాటు మన భవిష్యత్ అంధకారంలోకి నెట్టుకున్నట్లే. సార్వత్రిక ఎన్నికలకు నేడు పోలింగ్ జరగనుంది. ఓటర్లు ఈవీఎం యంత్రాలపై ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఏం చేయాలి? అక్కడ అధికారులెవరు ఉంటారు? ఈవీఎంపై ఎలా ఓటు వేయాలి? అనే అంశాలను ఒక్కసారి చూద్దాం.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటరు స్లిప్పులు పంపిణీ జరగకపోయినా, నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. అక్కడ బీఎల్‌ఓలను కలిసి ఓటరు స్లిప్పు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరు కార్డు లేకపోతే, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఫోటోతో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫోటోతో కూడిన పెన్షన్ కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఎన్‌ఆర్‌ఐలు అయితే పాస్‌పోర్టు గుర్తింపు కార్డుగా చూపించొచ్చు.

పోలింగ్ బూత్‌లో..

బూత్ లోపలికి వెళ్లాక మొదటి పోలింగ్ అధికారి వద్ద మీ పేరు, క్రమ సంఖ్యను తెలపాలి. ఆయన తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో ఓటర్ ఐడీ పేరు, సీరియల్ నంబర్ చెక్‌చేసి నిర్ధారిస్తారు. మీ వివరాలను అందరికి తెలిసేలా చెబుతారు. పక్కనే ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల తరపున ఉండే పోలింగ్ ఏజెంట్లు ఆ వివరాలను తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో చెక్ చేసుకుంటారు. ఇక్కడ ఏదైనా తేడా వస్తే ఏజెంట్లు అభ్యంతరం తెలిపేందుకు అవకాశం లేకపోలేదు.

బీప్ సౌండ్ వస్తేనే ఓటు నమోదైనట్టు

ఆ తర్వాత రెండో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లా లి. అతను మీ ఎడమ చేతి చూపుడు వేలి గోటిపై సిరా చుక్క అద్దుతారు. మూడో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అక్కడ ఆయన ఓటర్ స్లిప్ తీసుకుని అప్పటికే ఓటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను కేటాయిస్తారు. మీకు కేటాయించిన ఈవీఎం యూనిట్ దగ్గరికి వెళ్లాలి. అక్కడున్న ఈవీఎం బ్యాలెట్‌లో పోటీలో ఉన్న అందరి అభ్యర్థుల ఫోటోలు, గుర్తులు వరుస క్రమంలో ఉంటాయి. వాటిని గమనించి నచ్చిన పార్టీ ఎదురుగా ఉన్న బటన్‌ను గట్టిగా నొక్కాలి. రెడ్‌లైట్ రావడంతో పాటు బీప్ సౌండ్ వస్తుంది. అప్పుడు మీ ఓటు వినియోగించుకున్నట్టు అర్థం. అదే సమయంలో పక్కన ఉన్న వీవీప్యాట్‌లో మీరు ఏ గుర్తుకు ఓటు వేశారో ఆ గుర్తు కనిపిస్తుంది. దాన్ని కూడా గమనించి మీరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందా.. లేదా అనేది నిర్ధారించుకోవచ్చు. పోటీలో నిలిచిన ఏ పార్టీ అభ్యర్థి మీకు నచ్చకపోతే మీరు బ్యాలెట్‌లో ఉన్న నోటా గుర్తు ఎదురుగా ఉన్న బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఇలా చేయొద్దు..

పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్‌ఫోన్‌లు, కెమేరాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. సెల్ఫీలు తీసుకోవడం కూడా నేరం. మీరు ఈవీఎంలో ఒక బటన్ నొక్కిన తర్వాత మరో బటన్ నొక్కొద్దు. దీని వల్ల మీ ఓటు నమోదు కాదు. వృథా అవుతుంది. అందుకని ఒక సారి మాత్రమే బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవాలి.

పటిష్ట బందోబస్తు

పాలకొండరూరల్: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. ఎన్నికల పరిశీలకుడు రమాకాంత్ ప్రదాన్‌తో కలిసి మండలంలోని సీఎంపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు నేర చరిత్ర కలిగిన 50 మందితో పాటు మరో 300 మందిపై బైండోవర్లు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

